# కఠినాత్మురాలు

"తమరు కాబట్టి, ఆ బూమాలచ్చి లాటోరు కాబట్టి... సుప్పనాతిలాంటి ఆ కోడలు పిల్లతో ఈడుసుకోత్తున్నారు కాని నాలాంటి దయితే ఈపాటికి ఇటో అటో తేల్చేసుకోకపోనా పెద్దమ్మగోరూ. అయినా నా కెరిక నేదుగాని ఏటి సూసుకునండీ మన బుల్లెమ్మాయిగోరికంత గరవం? తనంత సక్కని సుక్క నేదనా? తన పుట్టింటోరు పేద్ద బాగ్గమంతులనా? తమరేటంటే అనుకోండిగాని పెద్దమ్మగారూ! సిన్నబ్బాయిగోరు బుల్లెమ్మగోర్ని మరీ నెత్తి కెక్కించేసుకుంటున్నారు. చూడండి... ...మా కోడలూ ఉంది మరి మా గుంటడూ ఉన్నాడు... ఇలా అద్దు దాటనిత్తాడా మరి., మొన్న మాపటేల అది ఇలాగే నామీద ఇంతంత గుడ్లు సేసుకుని ఎగర బోయింది... ...అప్పుడు మా గుంటడు ఏం సేసేడను కున్నారు?"

"ఏం చేశాడే? ఏం చేశాడే?" అని ఆత్రుతగా అడ

క్కుండా ఉండలేక పోయింది రుక్మిణమ్మ, అడుగుతూ తల పైకెత్తింది.

"అలా తల కదిపేస్తే ఎట్టాగండీ పెద్దమ్మగోరూ! సేతి కొచ్చిన పేను ఎక్కడో కలిసిపోనాది. తలొంచుకు కూకోండి మరి... ...అని కోప్పడింది కాసులు. కోప్పడుతూనే విసుక్కుంది.

"అయినా ఓ సంరచ్చనా వల్లకాదా? ప్రతీ వారం తను పోసుకున్నప్పుడు మీా తలనీ యింత నూని సుక్కేడితే బుల్లెమ్మాయిగారి సేతులడి పోతాయి కాబోలు... ... నా నోరు సరిగా రాదు మరి ... ..." రుక్మిణమ్మ పెద్ద నిట్టూర్పే విడిచింది.

"అయ్యోరాత! అంత అదృష్టం ఉంటే, ఇంత ఏడుపెందుకూ? స-రే-లే... జరిగింది చెప్పు. నీ కోడలు నిన్నేదిరిస్తే నీ కొడుకేం చేశాడే?"

"ఏం సేశాడా? సిన్నబొబ్బాయి గోరిలా నుంచోమంటే నుంచునీ, కూకోమంటే కూకునీ ఓటంగాదు మరి. ఎక్కడ్నుంచో యింత పొడుగున సింత బరికోటి పట్టుగొచ్చేడు. 'ఏటే! ఏటే! మా అమ్మతో పేలావుట? మళ్ళీ పేలు' అని సావగొట్టేసినాడమ్మగోరూ... ఒళ్లు వూనం సేశాడనుకోండి. కొట్టినసోటు నేదు. కొట్టని సోటునేదు ...గొడ్డుని బాదినట్టు బాదేసినాడు... బొట్టి ఏటయిపోతుందో నానెందుకు సెప్పేన్రా బగువంతుడా అని ఎంత గిలగిల లాడిపోనాదో నా పేనం... ఎంత సేపటికి ఆగడే, ఎవరు సెప్పినా యినుకోడే... అయ్యో సచ్చి పోతుందిరా బాబూ' అని నానే అడ్డుకున్నాను.

"సావనీ... ఇది సస్తే దీని బాబు అమ్మమ్మ మొగుడు లాంటిది మూడోనాటికి ఇంకో ర్తి... పెళ్ళాంపొతే మరో ర్తి వస్తుంది. తల్లిపొతే రాదుకదా !" అన్నాడు.

రుక్మిణమ్మ కళ్లు మిలమిలమెరిశాయి. అంతకంటె ప్రియమైన సూక్తి, మధుర ప్రసక్తి మరొకటి ఆమెకా క్షణాన తోచ లేదు.

"అమ్మా ! ఇంట్లో పాతకోటు ఏదయినా ఉంటేయిప్పించండి తల్లీ! బిడ్డడు సలితో పొలంలోకి ఎల్లలేకుండా ఉన్నాడూ,"

"బాగుందే, రామాయణంలో పీడకల వేటలా వెధవ సొదా నువ్వూనూ... సరే, దానికేంలే. వెళ్ళేటప్పుడు మరచి పోకుండా అడుగు. పడేస్తానుగాని ...ఏమిటీ, ఏమిటి నీ కొడుకన్నదీ... ఏదేదీ, సరిగ్గా చెప్పూ, నేను సరిగ్గా వినలేదే..."

"అమ్మ కడుపుసలవ తెలిసిన బిడ్డ తల్లి ! వాడు ...నామాటే ఆడికి సచ్చె పెమాణాం ... నామీద ఈగ వాత్తే సాలు, ఇరుసుకు పడిపోతాడు, కట్టుకున్నది పోతే మూడ్నిమసాల్లో మరో ర్తిని పిరాయింపు సేసుకోవచ్చు... కన్నకల్లి పోతే మరి రాదుకదా ?"

"కాసులూ ,... ఎంతదృష్టవంతురాలివే నువ్వూ... ఏ కుల మయితేనేం, ఏ గుడిసెలో ఉంటేనేం... ఏ బంగారు పూలతో పూజ చేశావో దేవుళ్లాంటి కొడుకుని కన్నావు. నవమాసాలూ మోసి కన్నందుకు నీ కొడుకు తల్లికి చెయ్యి

వలసిన గౌరవం చేసి రుణం తీర్చుకున్నాడు... పెద్ద పెద్ద చదువులు చదువుకున్నామనీ... వందలకి వందలు నెలకి కుమ్మరిస్తున్నామనీ మీసాలు మెలేసే అడంగిలేకుల చవటలందరికీ ఒక్కమాటలో — సరిగ్గా ఒక్కటంటే ఒక్క ముక్కలో బుద్ధి వచ్చేలా ఎంత చక్కగా చెప్పాడే కాసులూ! నీ కొడుకు!"

రుక్మిణమ్మ రెచ్చిపోయింది. చూస్తుండగానే ఆమె కంఠస్వరం హెచ్చిపోయింది. పాపాయికి పాలు కలుపుదామని వసారాలోంచి వంటింట్లోకి అప్పుడే వెళ్ళింది గౌరి. 'ఇవాళ్ళి పేపరేదీ?" అంటూ మొహం కడుక్కుని అప్పుడే పెరట్లోంచి ఇంట్లోకి వస్తున్నాడు శేషగిరి. వాళ్ళు ఆ చుట్టుపక్కలే ఉన్నారని తెలియగానే రుక్మిణమ్మకి మరీ పట్టపగ్గాలు లేకపోయాయి.

"ఊరుకోండి, వాళ్ళు వినగలరు. అన్నట్టు సంజ్ఞ చేసింది. కాసులు.

"విననియ్యవే... ఏం తలకొట్టి మొలేస్తారా? మలమల మాడిపోతున్న భగభగ మండిపోతున్న, మాతృ హృదయమనే అగ్ని పర్వతాన్ని ఏవరు ఎన్నాళ్ళని ఆపగలరే? కష్టాలతో రోగాలతో చివికిపోయిన మనస్సు ఎన్నాళ్ళని ఆగగలదే! రక్తంలో రక్తంగా, కండలో కండగా ఎన్నో ఆశలతో, ఎంతో వేదనతో తొమ్మిది నెలలు మోసి... చీమూ, నెత్తురూ ధార పోసి కని... పెంచి పెద్దచేసి... మంచీ చెడూ చెప్పి, మనిషిని చేసి, తల్లికొడుకు కోసం ఎంతో త్యాగంచేసి అష్టకష్టాలు పడేది ఇందుకోసమే గదుటే? 'అమ్మా, నాకోసం ఎన్ని

ష్టాలు పడ్డావమ్మా' అనే మాట మాత్రం కృతజ్ఞతయినా చూపనివాడు. కొడుకేనుటే? పెళ్లాం అన్నది ఒకర్తి జతపడ గానే... ఇహ ప్రపంచంలో తన కొొకడికే పెళ్ళయినట్టూ మరె వరికి పెళ్ళామే లేనట్టూ దానిలో లీనమయిపోయి, దాని కన్నె ర్రకే గడగడ లాడుతూ కామాంధకారంలో కన్నతల్లిని కనిపెట్ట నివాడు—మనిషేనుటే ?

"కాసులూ! ఎంత వివేకవంతుడే నీ కొడుకు! ఎంత చక్కగా చెప్పాడే! పెళ్లాం పోతే మరోర్తి ఒస్తుంది. తల్లి పోతే రాదుకదా! తెలిసే అన్నాడో, జన్మ జన్మల సంస్కారం వాడిచేత అలా పలికించిందో ఇంతకంటె సరియైనమాతృస్తవం లేదు. కేవలం కామతృప్తి కోసం నిర్దేశింపబడిన భార్యకీ, నిష్కాముకురాలైన తల్లికీ ఎంత చక్కగా తేడా చూపించాడు నీ కొడుకు!"

* * *

గారికి యిక ఆ తరువాత మాటలు వినబడలేదు. ఆమె సహనం దెబ్బతింది. ఆమె హృదయం గాయపడింది. ఆమెలో అతి సున్నితమైన భాగం ఏదైనా ఉందీ అంటే అది ఆనాటితో ముక్కలయింది.

అలా అని రుక్మిణమ్మగారినీ తప్పు పట్టలేం. ఆమె పెరిగిన వాతావరణమూ, ఆమె నమ్మిన విశ్వాసాలూ అటు వంటివి. అన్నిటినీ మించి అందరి ఆడవాళ్ళ లాంటిదే ఆమె. మొగవాళ్ళు ఆడవాళ్ళనుంచి కొన్ని ఆశించి పొందలేక ఎలా

బాధపడతారో, అలాగే ఆడవాళ్ళు కూడా తమ అధికారాల్ని సుస్థిరం చేసుకుందామని ప్రయత్నిస్తారు. అనురాగమనేది అతి సున్నితమైన, సహజమైన అనుబంధమనీ దాన్ని 'క్లెయిమ్' చేసి రచ్చకీడుస్తే అందులో ఉన్న సరసతా, సొగసూ నాశనమవుతుందనీ వాళ్ళ ఊహకి అందని విషయం.

రుక్మిణమ్మగారికి వరసకి పెత్తల్లి అయిన మహాలక్ష్మమ్మగారు ఆమెకి ఒకసారి చెప్పిన సలహా అలాటిది మరి 'చూడు రుక్కు తల్లీ! ... ... నీకా ఒక్కగా నొక్క కొడుకూ ... ... నీ ఆశలన్నీ వాడివల్ల తీరవలసిందే. మరీ ... కాస్త మెత్తగా ఉండేదీ, చెప్పినమాట వినేదీ చెయి లోకువ బాగా ఉన్నదాన్ని నీకోడలుగా ఎంచుకో. కొడుక్కి అందంలో చదువులో, కని పాటలలో, వయసులో ఈడూ. జోడూ అయిందా, లేదా అనే మాటకంటే తను చెప్పిన మాట వినేదా కాదా అనేమాటే అత్తకి ముఖ్యం... చెయిదాటి పోయిందో ఇహ నీవల్ల కాదు...''

నిజమే ... మహాలక్ష్మమ్మగారి కోడలుకూడా చెయిదాటి పోయిన మనిషే. అయితే ఆవిడ ఆ సంగతి చివరి రోజుల్లోనే గ్రహించగలిగింది. ఎప్పుడు గ్రహిస్తే ఏంగాక, ఆవిడ తన పగ తీర్చుకుని గాని కన్ను ముయ్యలేదు.

ఓసారి మహాలక్ష్మమ్మగారి కోడలు వెంకటరత్నాన్ని చూడ్డానికి ఆమె స్నేహితురాలు సీతారావమ్మ వచ్చింది. మాటలో మాటొచ్చి ఆ పిల్ల అడిగింది.

"అదేమిటే రత్నం, యింకా చెవుల్ని ఆ రాళ్ళదుద్దులు

పెట్టుకు తిరుగుతున్నావ్ — మీ ఆయనకి తాసీల్దారు అయిం దిటగా, ఈ పాటికి రవ్వాల ముద్దులు చేయించమనూ…"

"ఎందుకూ ? మా అత్తగారి చెవులకున్నవి వజ్రాలివే"

"మీ అత్తగారు నీ కెందు కిస్తుందే, కూతురుండగా!"

"బాగుంది … … నీకంత బాగా తెలుసన్న మాట. … ఆవిడ సవితి కూతురు తెలుసా? అదికాక, ఆవిడకీ ఈవిడకీ మధ్య పచ్చి గడ్డేస్తే భగ్గుమంటుంది…"

"అలాగా! ఓహో అందుకా, ఈ మధ్య మీఅత్తగారికి జ్వరం వచ్చిందగ్గర్నుంచీ మరీ నువ్వు కంటికి రెప్పలా చూస్తున్నావనీ చెప్పు కుంటూంటే ఏమో అనుకున్నానే… …"

"లేకపోతే? మిల మిల మెరిసే ఆ వజ్రాల మొహం చూసిగాని … … నల్లగా మసిబొగ్గులో సమాన మయిన ఆ కోతి మొహాన్ని చూసే నేను మోజు పడ్డాననుకున్నావా? ఎంత వెర్రిదానివే!"

ఈ చివరి మాటలు మహాలక్ష్మమ్మ చెవిలో పడ్డాయి. అయితే దానికి తగ్గట్టు కోడల్ని కోడంత్రటికం పెట్టకుండానే ఆమె మంచం ఎక్కేసింది. వాతం కమ్మి అమెకు మాట పడి పోయింది. అతి తొందర్లోనే అవసాన కాలం వచ్చేసింది. అయితే ఆమె ప్రాణం మాత్రం ఒక పట్టాన పోలేదు. బంధు వులందరూ మంచం చుట్టూ చేరారు.

"మనస్సులో ఏదో కోరిక ఉండి పోయింది … … అది తీరుస్తే గాని ఆ జీవుడు పోదు" అన్నారు ఎవరో. ఆ కోరిక ఏమిటో ఎవరికీ అర్థం కాలేదు. ఆవిడ కళ్ళు విప్పి చూస్తూనే

ఉంది. ఆఖరిదాకా ఆవిడకి తెలివి ఉండనే ఉంది. కాని ఆవిడ మాటాడనేలేదు... ... కాళ్ళూ చేతులూ కదల్చలేదు. ఏం చేస్తామన్నా ఆవిడ కళ్ళల్లో తృప్తి కలగలేదు.

"ఒంటెడు బంగారమూ కొడుకు చదువుకే పెట్టింది... వెర్రితల్లి ఎంత రుణపడిందో... ఇంక ఒంటిని ఒక్క దుద్దుల జత మిగిలింది... దాన్ని గురించే కాబోలు' అంది ఒకావిడ'

"వజ్రాల దుద్దులు తియ్యమన్నావా?" గట్టిగా చెవిలో నోరెట్టి అరిచారు. ఆమె కళ్ళలో అంగీకారం కనపడింది. దుద్దులు తీశారు.

"ఇలా ఇవ్వండి... అవి నాకోసమే... అదే ఆవిడ ఉద్దేశం ...పాపం మా అత్తగారు ఎంత మంచివారో" అని ఆ దుద్దుల్ని ఆప్యాయంగా అందుకుంది వెంకట్రత్నం. కాని మహాలక్ష్మమ్మగారు అయిష్టంతోనూ, అసహ్యంతోనూ ఉన్న శక్తి నంతటినీ కూడ తీసుకుని ఒక్క మూలుగు మూలిగింది. దాన్తోనే ప్రాణం పోతుందనుకున్నారు అంతా.

"అదేమిటే? చచ్చేదాకా ఒళ్ళు హూనం చేసుకుని చాకిరీ చేసిన కోడలికి కాదూ ఆ దుద్దులూ? మరెవరికి?" అమ్మలక్కలందరూ బుగ్గలు నొక్కుకున్నారు.

టెలిగ్రాం అంది అప్పుడే సవితి కూతురు బండి దిగింది ఆమెను చూస్తూనే మహాలక్ష్మమ్మగారి కళ్ళల్లో కొత్తధైర్యం. వచ్చింది.

"ఆవిడకి దగ్గరవాళ్ళు యింకెవరున్నారు? ఆ వజ్రాలు దుద్దులు నీకోసమేనేమో చూడవే అన్నారు. ఎవరో. ఆవిడ

పిన్ని కళ్ళలోకి చూసింది. అందులో 'పెట్టుకో తల్లీ' అన్న భావమే ఆమెకు కనిపించింది.

"పిన్నీ, ఈ దుద్దులు నేను తీసుకోనా ?" అని ఆమెకు వినపడేలా అరిచింది. అవునన్నట్టు చూసింది. మహాలక్ష్మమ్మ గారు. ఆవిడ సవితి కూతురు దుద్దుల్ని తీసి పెట్టుకుంది, పది హేనేళ్ళయి కాపురం చేస్తున్న ఆడపిల్లని సవితి కూతురని గుమ్మంలోకి పిలిచియింత పసుపూ, కుంకుమా యివ్వడం ఎరగని మహాలక్ష్మమ్మగారు ఆనాడు ఆ పిల్ల దుద్దులు పెట్టుకుంటూంటే తృప్తిగా చూసింది. వెలవెలబోతున్న వెంకట్రత్నం మొహంవైపు చూచి మొహం చిట్లించింది.

అంతే,

ఆమె కాంక్ష తీరింది. ఆమె కన్ను మూసింది.

అదిగో అంత పట్టుదల గలది ఆ మహాలక్ష్మమ్మ గారు. ఆవిడ ఓసారి రుక్మిణమ్మగారి యింటికొచ్చిన సందర్భంలో యిచ్చిన సలహా ఇదీ :

"చూడు రుక్కు తల్లీ... ఇంటి తాళాలే కాదు ఆఖరికి వంటింటి తాళాలయినా కోడలికి అప్పచెప్పకు అధికారం చేతిలో పెట్టావా, బతికున్నన్నాళ్ళూ ఏడ్చి మొత్తుకున్న యిహ లాభంలేదు. అది సబబు అయినా, కాకపోయినా కోడలు నీమాట వినవలసిందే ఆవిడ మనవల్నెత్తే అంత వయసొచ్చిందయినా అత్తగారూ ! ఏంకూరరొండమన్నారూ ?" అని రోజా సిన్నడగవలసిందే. కూరలవాణ్ణి పిలవడానికి వీధి గుమ్మం దిగవల్సి వచ్చినా సరే, నీ 'అనుజ్ఞ' పొంది తీరవలసిందే. ఈ నిబంధనలు ఈనాడు నువ్వూ, నేనూ, పెట్టినవి

కావు... ఈనాడు ఈ కట్టుదిట్టాలు మనిద్దరం కూచుని నిర్ణయిం చినవి కావు... ఏనాడో మన 'ఋషులు' ఇవన్నీ రాసి పెట్టే శారు."

ఇలాంటివి ఉగ్గుపాలతో నేర్చుకుని అక్షరాలా ఆచర ణలో పెట్టింది రుక్మిణమ్మగారు. కళ్ళు తెరవని పిల్లిపిల్ల తల్లి కడుపులో తలదాచు కున్నట్టు ఆవిడ సిద్ధాంతాల్నే సత్యంగా భగవత్స్వరూపంగా నమ్మింది. అందుకనే ఆవిణ్ణి తప్పు పట్టలేం.

*　　　*　　　*

ఇంట్లోకి రాబోయిన శేషగిరి పెరట్లోకి వెళ్ళి నూతి చప్టామీద కూచున్నాడు. అతని మనస్సంతా అదోలా అయి పోయింది. అతని కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి, 'అమ్మా, నాకెందుకు పెళ్ళిచేశావు?' అని బావురుమన్నాడు. చెంపల మీద కన్నీళ్లు చొక్కాతో అద్దుకున్నాడు.

నేను కాల్చిన సిగరెట్టుమీద సిగరెట్టు పొగ మేఘా లలో, నేను కొట్టిన బ్యాట్‌మెంటెన్ బాల్ అంత స్పీడుగా నా జీవితం హాయిగా వెళ్ళిపోయేది. నే నేం పెళ్ళి చెయ్యమని నిన్ను ప్రార్థించానా? అవసరంమాట దేవుడెరుగు; ఆదుర్దా అయినా ప్రకటించానా? నేను ఒంటిగా హాయిగా ఉంటే కన్నతల్లివే, నీ కన్నే కుట్టిందా అమ్మా?"

"బాబూ! ముసల్దాన్ని... కాటికి కాళ్ళు జాచుకున్న దాన్ని... నువ్వో ఓ యింటివాడివయితే చూసి, మరీ కన్ను

కన్నముత్యాల నుందిరా నాన్నా... అన్నావు... నువ్వూ,నీ పెళ్ళామూ చిలకా గోరింకల్లా కాపురం చేస్తూంటే. చూచి ఆనందించాలని ఉందిరా తండ్రీ అన్నావు...

"నిజమేనా? గుండెమీద చెయ్యి వేసుకు చెప్పు అమ్మా... మేం కాపురం చేస్తుంటే నువ్వు చూచి ఆనందించావా? కఠినమైనా, సత్యాన్ని బయట పెట్టవలసిందే... అసలలా మమ్మల్ని ఒకనాడయినా ఆనందించనిచ్చావా? నిన్ను ప్రార్థిస్తున్నాను నిజం చెప్పు తల్లీ."

ఇవాళ మాటే అడుగుతున్నాను... చచ్చినంత రికార్డు అయిందనిపించి అన్ని శక్తులూ అమ్ముకుని అలసిపోయి ఆఫీసునుంచి ఇంటికొచ్చాను. అది పనిపాటలతో విసిగుంటుంది: ఇద్దరం కలిసి అలా ఏ షికారుకో వెళదామనుకున్నాను...?

"..ఎందుకొచ్చానా అని యిప్పు డనుకున్నట్టు చేశావు !

కన్న కొడుకుల సుఖానికి యింతగా అడ్డొస్తున్నామనీ. అడ్డు తెస్తున్నామనీ మీరు కలలోనయినా అనుకోడంలేదా? మీరు లేకపోతే ఇల్లు చల్లగా ఉంటుందన్న భయంకరమైన భావం మీరు మీ కొడుకులకు కలుగజేస్తున్నారనే విషయం మాటే నిజంగానే తెలియదా తల్లుల్లారా !"

ఎదురుగుండా తల్లిని అనలేనవి. అడగలేనవి వందల కొద్దీ ప్రశ్నలు శేషగిరి తనను తనే—తన లోనే వేసుకున్నాడు తన ఉద్దేశం ప్రకారం నిజానికి గౌరి నెమ్మదైన మనిషి. పది మాటలకు ఒక మాటయినా జవాబు చెప్పదు. ఆ మాటయినా

అవుననో ...కాదనో... అంతే ...తన పనేదో తను చేసుకు పోతుంది.

"పైకలా ముంగిలా ఉంటుంది కాని ... అమ్మో అలాంటివాళ్లే కొంపలు తీసే రకం అంటుంది అమ్మ, ఇంకెలా చావడం ?

"పోనిద్దూ నిన్నే దిరించ లేదుకదా, నీతో వాదించ లేదుకదా పెద్దదానివి నువ్వే ఊరుకోరాదుటే" అని తను ఉండబట్టలేక ఎప్పుడేనా అంటే...

'సరే యింకెలా ఎదిరించాలి నాయనా ఆ కళ్ళు చిట్లించడం. ఆ మూతి విరవడం అంతకంటే వేరే ఏం కావాలి నాయనా ? అయినా పెళ్లాల్ని దాన్లో పెట్టుకోలేనివాజెమ్మవి నువ్వా నాకు నేప్పడమే మిత్రా ?" ఇదిగో ఇదే వరస

"అవుననదూ, కాదనదూ. ఎంతోలోతున్న మనిషయినా అవును! ఎంత గోతులుతీసే రకమయినా అవును... ఇలాంటి కోడల్నిచ్చినా కొంప తీశావా భగవంతుడా ! అయినా నిన్నని ఏం లాభంలే మన బంగారం మంచిది కాకపోతే ..."

"ఏం చెయ్యమంటావమ్మా నీ కోడల్ని? ఎంత సేపూ 'పెళ్లాం గీసిన గిరిని దాటలేని సన్యాసి' అనుకుంటారే కొడుకుల్ని పెళ్లా మన్నది పశువుకాదనీ దాన్ని బందిలి దొడ్డిలో పెట్టడం అంత సుళువు కాదనీ, పెట్టినా సుభంలేదనీ మీకు తెలియదా ?...

'ఇందులో నా తప్పు ఏముంది?' అనుకున్నాడు శేషగిరి. అందుకనే శేషగిర్ని తప్పు పట్టలేం.

పోనీ గారిదేమో తప్పనుకుంటే ఆమె మనసులో

అయినా అత్తగారికి అపకారం తలపెట్టేదికాదు ఆమెను కంటికి రెప్పలా పెంచిన ఆమె తండ్రి నేర్పిన బుద్ధులు అటువంటివి 'గౌరీ! పుట్టింట్లో ఆడపిల్ల తప్పు చేసినా ఏమీ అనరు. అత్తింట్లో ఒప్పు చేసినా మెచ్చుకోరు. మీ అత్తగార్ని అత్తగారిలా కాక నీ యిష్టదైవాన్ని ప్రసాదించిన మాతృమూర్తిగా చూసుకో తల్లీ .. భర్త స్త్రీలకు దైవమే. అయితే ఆ దైవాన్ని కన్న తల్లి దయ్యం కాబోదు కదా! పుట్టినింటికీ, మెట్టినింటికీ కీర్తి తే తల్లీ.'

నాన్నని తల్చుకుని వెక్కి వెక్కి ఏడ్చింది గౌరి.

'నే నింక ఆ మాటలు పడలేను... ఆ కోత భరించలేను భరించి బతకలేను నాన్నా' అని పరితపించింది గౌరి.

'కన్నతల్లి పోతే మరి రాదు! పెళ్లాం పోతే మరొకర్తి వస్తుంది!'

ఆమె అభిమానం దెబ్బతింది...తన స్థానాన్ని అంత తక్కువగా నీచంగా చూసుకోలేక ఆమె మనసు తిరగబడింది.

అంతేనా? కట్టుకున్న ఆడదానిస్థానం అంతవరకేనా? భార్య అనేది కేవలం భోగ్యకరమైన వస్తువేనా? భార్యాభర్తల సంబంధం జన్మజన్మాల అనుబంధం కాదా? చక్కగా, చల్లగా చూడముచ్చటగా జరిగేసంసారంలో పవిత్రతాపరమార్థమూ లేవా? సంస్కృతమూలైన మంత్రాలతో అగ్నిసాక్షిగా భర్త భార్యను స్వీకరించేది నీచమైన కోరికలను తీర్చుకునే వరకేనా?

'ఇది పోతే దీని బాబు లాటిది మరొకర్తి' ఇంత అల్పప్రాయమైనదా అర్థాంగి స్థానం?

అంతకుముందు గౌరి అత్తగారి మాటలు పడలేదని

కాదు. కాని ఆ మాటలతో మాత్రం ఆమెలోని మార్దవం అంతా కరిగిపోయింది.

"ఈ మాటలు ఇకపడలేను... ఈ ఇంట్లో యిక ఉండలేను... ఈవిడమొహం యిహ చూడలేను, అనుకుంది గౌరి. అనుకుంటూ నాలిక కరుచుకుంది.

ఆయనకు తల్లి సేవ విధాయకం. ఆయనతోపాటు ఆయన యిల్లాలినైననాకూను. కాని ఎంత కాలం భరించగలను ఇలా ఎన్నాళ్లు బతుకుతాను? గౌరి చీర చెరగుతో కళ్లద్దుకుంటూంటే శేషగిరి లోపల కొచ్చాడు.

"నీకంత కష్టంగా ఉంటే నీకు తోచిందేదో జవాబు చెప్పకూడదూ? ఏ మాటా తేల్చవ్... నీతో ప్రాణం విసుగెత్తిపోతోంది."

మొగుడు కూడా తన్నే అనడం గౌరి భరించలేకపోయింది.

"అవునండీ తప్పంతా నాదే... నేను బతకడమే తప్పు... మీ అమ్మగారు నన్ను అనరాని మాట లనడం బాగుంది. మీకు అమ్మ ఒక్కత్తే... నాలాటిది చస్తే, నాల్గో రోజుకి మరొకర్తె మీకు."

శేషగిరి ప్రాణం అప్పటికే విసిగెత్తి ఉంది. తల్లి అన్న మాటలను గౌరి తనమీద ప్రయోగించడంతో అతనికి మరీ ఒళ్లు మండింది. ఏమంటున్నాడో అతనికే తెలియలేదు.

"నిజమే... నా బాధలన్నీ నీలాటి తెలివితక్కువ దానివల్లనే... నీలాటిది లేకపోయినా నాకు విచారం లేని మాటా నిజమే... మరో గడుసుదాన్ని మరుక్షణంలో

కట్టుకుంటాను". అనేసి ఆ గదిలోంచి వెళ్లిపోయాడు ఇంకా పట్టు ఏదయినా ఉందీ అంటే అదీ తెగిపోయి హృదయం పూర్తిగా బ్రద్దలవగా గౌరి కుప్పగా కూలిపోయింది.

ఆమె మనసు మరి కోలుకోలేదు !

ఇక ఆమెను ఏమని తప్పు పట్టగలం !

* * *

ఇంట్లో అందరూ ఇలా బాధపడుతుండగా "ఏదీ తప్పు చూపించమన్నా. అంటే చూపించే లాగా ముక్కుమీద వేలేసుకుని ఉయ్యాల్లో పాపాయి మాత్రం కేరింతాలు కొడుతున్నాడు.

* * *

మర్నాడు సాయంకాలం శేషగిరి ఆఫీసునుంచి వచ్చి బట్టలు మార్చుకుని గదిలో కూచుని ఉండగా గౌరి కాఫీ తెచ్చి యిచ్చింది. అతను వేరే పనిలో ఉండి వెంటనే గ్లాసు అందుకోలేదు. ఆమె అలా చెయ్యెత్తి ఎక్కువసేపు నిలబడలేక అక్కడ బల్లమీద గ్లాసు పెట్టి చూస్తూండగానే పక్కనున్న కుర్చీమీదకు ఒరిగిపోయింది. శేషగిరి ఆదుర్దాగా ఇటు తిరిగాడు. భార్య గడ్డం పట్టుకుని పైకి ఎత్తాడు. కొన ప్రాణంతో ఉన్నట్టుంది. మొహం ... నూతిలోంచి వస్తున్నట్టుంది స్వరం.

"అదేం ? అంతసీర్సంగా ఉన్నావ్ ? ఒంట్లో బాగులేదా"

"కొద్దిగా తల నొప్పిగా ఉంది. అంతే ?"

శేషగిరి భార్య చెంపమీద చెయ్యివేసి చూశాడు. ఛెంప కాలుతూ ఉంది.

"అయ్యో జ్వరం తగిలినట్టుందే... బాగా ఎక్కువగా ఉన్నట్టుంది. కూడాను... జ్వరం ఎప్పుడొచ్చింది? అమ్మా. అమ్మా?"

"ఏం బాబూ" అంటూ రుక్మిణమ్మ అక్కడికొచ్చింది.

"గారికి జ్వరం వొచ్చినట్టుందే..."

"ఏమో బాబూ ఏమయినా చెప్తుందా చేస్తుందా. నువ్వు రాగానే ఏనాటి టపా ఆనాడు అందించెయ్యకపోతే.. పోనీ ఆడకూతుర్ని ఇంట్లో ఒక్కర్తిని బిక్కు బిక్కుమంటూ ఉన్నాను. నాతో చెప్తే కాలు కదపనిస్తానా? తనకి ఒంట్లో కాస్తనలతగా ఉంటే నన్ను అసలు ఏపనీ ముట్టుకోనీయదు. ఒంట్లో బాగులేకపోయినా కోడలిచేత నానా చాకిరి చేయిస్తోంది ఈ అత్తగారు అని అందరూ అనుకోవద్దూ—"

తల్లిని పిలిచినందుకు శేషగిరి తనమీద తనే విసుక్కున్నాడు... ఒంట్లో బాధ ఏమిటి? ఎంత రేచరు ఎంతుంది? ఇలాంటి ఒక్క ఫళ్ళ ఆమెనోటివెంటరాదు! పైగా ఇదీధోరణి తనేమైనా జవాబు చెబితే మరింత వాగ్వాదంతప్ప కలిసొచ్చేది ఏమీ లేదు. తల్లిని మింగెయ్యాలన్నంత కోపం తనలోనే దిగమింగి శేషగిరి అక్కణ్ణుంచి లేచి వెళ్ళిపోయాడు.

ఏడుస్తున్న పిల్లాణ్ణిఉయ్యాల్లోంచి పైకితీసిందిరుక్మిణమ్మ.

"నీ ఏడుపు నా ఏడుపూ ఈ ఇంట్లో వినేవాళ్లెవరున్నార్రా వెర్రి వెదవా! ఉన్నమాటకూడా పైకి గట్టిగా అనుకోడానికి లేదు. పాడుకొంప 'పద' అంటూవాణ్నెత్తుకునిఎదురింటికి పోయి కూచుంది. ఆవిడ వెళ్లగానే శేషగిరి లోపలికొచ్చాడు. మంచం వాల్చి అందిమీద పరుపు పరచాడు మెల్లిగా గౌరిని

లేవనెత్తి దానిమీద పడుకోబెట్టాడు... శాలువ కప్పాడు కొంత సేపటికి ఆమెకు నిద్రపట్టినట్టు తోచి వంటిట్లోకి వెళ్ళాడు. పీటా, కంచం వేసుకుని వడ్డించుకున్నాడు. అతి దీనమయిన గౌరి మొహం అతనిముందు ప్రత్యక్షమైంది. కడుపు దేవేసి నట్లయింది.

"గౌరీ! ఎవరో కాదు నేనే వేటగాణ్ణి, ఎవర్తో కాదు నువ్వే లేడిపిల్లవి నీకంటె రెట్టింపు వయసున్న మీ అక్కలిద్దరూ వేరింటి కాపురాలు హాయిగా ఎలిగిస్తున్నారు. తనదీ అనిపించు కున్న ఇంట్లో తన చేత్తో మొగుడికీ, పిల్లలికీ యింత వండి వడ్డించడంకన్నా—ఆడదికో రేస్వర్గమూ. సౌఖ్యమూ లేదు.... ఎవరి ఆధిక్యతా, అధికారమూ లేని స్వేచ్ఛామయ జీవితం కట్టుకున్నదాని కనీసపు కోర్కె... నాకు తెలుసు గౌరీ, నాకు తెలుసు... కాని నేంచెయ్యాను? ఏం చెయ్యలేనుకూడా నాలాంటి 'అడక త్తెరలాంటి ఆడక త్తెరలో చిక్కుకున్న వాళ్లు, యింకా ఎంతమందో ఉన్నారనికూడా నాకు తెలుసు అలా చేయడం నా కేమీ ఉపశమనం కాదు కూడా... పందొమ్మిది కూడా నిండలేదు నీకు. పాపిష్టివాణ్ణి నేను"

శేషగిరి కంచంలో కన్నీటి చుక్కలు పడ్డాయి. చెయ్యి కడిగేసుకున్నాడు.

ఓ రాత్రివేళ గౌరికి తెలివొచ్చింది. శేషగిరి ఆ అలికిడికి లేచి బత్తాయిపళ్ల రసం తీసి ఇచ్చాడు.

"గౌరీ! నిజం చెప్పు... నిన్న అమ్మ అన్నమాటల్ని నువ్వు పూర్తిగా మనసులో పెట్టుకు కూర్చున్నావుకదూ పిచ్చిదానివి కాకపోతే యిదేమైనా నీకు కొత్తా చెప్పు?

అయినా ఆ యిచ్చకాలముండ కాసులోక_ర్తీ... దాన్ని మూరు గుమ్మంలోకి రానియ్యకుండా కట్టుదిట్టం చేస్తానుండు..."

"బాగుందండీ, మధ్య అదేం చేసింది? నేనే లేని పోనివన్నీ మనసులో పెట్టుకుని ఒంటికి తెచ్చుకున్నాను. అనవసరంగా మీకు లేనిపోని యిబ్బంది తెచ్చి పెట్టాను... అక్కడ ఆఫీసులో ఆ చాకిరీయేకాక యింట్లో కూడా మీరన్నీ చేసుకోవలసివచ్చింది. పైగా నా చాకిరీ ఒకటి ... ఇలా పైకి గౌరి ఏదో మామూలుగా అలవాటయిన మాటలన్నీ మాటాడేస్తోంది. కాని లోపల మనసు అంతకుముందు రోజున అత్తగారు అనిన అక్షరాలన్నీ నెమరు వేసుకుంటోంది.

"మీరు మీ అమ్మని విడిచి ఉండలేరు. అలా నేను ఉండమనను అది ధర్మవిరుద్ధం... కాని, గృహిణిగా నా స్థానాన్ని మీ అమ్మగారు ఆవంతయినా గుర్తించలేదు. పైగా ఏ నేరమూ ఎరగని నన్ను ఏ పాపమూ చెయ్యని నన్ను... ఇది ఉన్నా లేక పోయినా ఒకటే అన్నంత నీచంగా బహిరంగంగా దూషించారు. ఆవిడ మాటలను సహించేశక్తి క్షమించే శక్తీ, పోనీ, వినీవిననట్టు ఊరుకునేశక్తీ నాలో చచ్చి పోయాయి... ఆవిడే కాదు. అంతటి మాటలు అకారణంగా, అన్యాయంగా ఆవిడ నన్నంటూంటే మీ రదేమని అడగలేరు. ఆవిడ లేనప్పుడయినా నన్ను పిల్చి అమ్మ తరఫున క్షమాపణ చెప్పుకో అక్కర్లేదు; అంతవరకు నేను ఆశించనుగాని ... ఆవిడ చేసిందేమీ బాగులేదన్న మామూలు మాటయినా నాతో అనలేదు... తప్పు నాదే అన్నట్టు మాట్లాడారు. నాతో మీకు ప్రాణం విసుగెత్తి పోతోందన్నారు. మీ బాధలన్నీ నావల్లనే

అన్నారు... నేను లేకపోయినా మీకు విచారంలేదన్నారు— క్షణంలో మరోదాన్ని కట్టుకుంటానన్నారు! ఉన్న ఊరినీ కన్నవారినీ ఒదిలిఆడది భర్తదగ్గరకొచ్చేది యిలాంటి మాటలు పడ్డానికేనా? కట్టుకున్న మొగుడే కసిరి కొడితే మానుషంగల ఆడది భరించగలదా?... ఆఖరి ఆశకూడా అడుగంటిపోయింది. లేదు మీ గౌరి మీకికలేదు... మీకు కావలసినది అదేకదా!"

రాత్రి తెల్లవార్లూ అయిదు నిముషాలయినా గౌరికి నిద్రలేదు! తెల్లవారేసరికి ఆమె జ్వరం నూట నాలుగు ఉంది!

వారం రోజుల్లో గౌరిస్థితి ప్రమాదస్థాయిని చేరుకుంది. ఎన్ని మందులిచ్చినా ఆమె టెంపరేచరు కొంచమైనా తగ్గ లేదు. సరిగదా ఇతర "కాంప్లికేషన్లు" కూడా వచ్చాయి ఈ వారంరోజులూ శేషగిరి శెలవు పెట్టి యింటి పట్టునే ఉన్నాడు ఇంట్లో వంటా, చాకిరిమాట అలా ఉంచి. పాపాయిని పట్టు కోవడం మరీ కష్టమయిపోయింది. వాణ్ణి చాలావరకు రుక్మి ణమ్మగారే చూసేది.

వారం రోజుల్లో తల్లి కొడుకులమధ్య అంతరం మరీ ఎక్కువై పోయింది. శేషగిరి మాట్లాడితే తల్లి మీద ఖస్సున లేస్తూ ఉండేవాడు.

"ఎలా ఉందిరా బాబూ దానికి?"

"దాన్నే అడక్కూడదమ్మా,ఏం నీకూ,దానికీమాటల్లేవా?"

"ఇవాళేమయినా కొంచెం నిద్రపట్టిందా?"

"ఇన్నాళ్లకయినా ఆ మాత్రం. కనుక్కోవలని పించిందన్నమాట... మెచ్చుకోవలసిందే."

"ఇక అది బతికే ఆశ లేదా నాయినా?"

"ఎందుకూ? బతికి ఏం సుఖపడాలి గనక."

ఇలాంటి జీవితంలో ఎప్పుడూ ఎరగని జవాబులతో రుక్మిణమ్మ మనస్తత్వం మారకపోయినా ప్రవర్తనమాత్రం చాలావరకు మారింది. ఆవిడకు లోపలికి వెళ్లి కోడలికి సేవ చేద్దామని మనసులో కోరికగలిగిననాడు కొడుకు ఆమెను లోపలికి ప్రవేశమే లేకుండా చేశాడు. కోడలికి ఒంట్లో ఎలా ఉందో తెలుసుకుందామని ఆవిడకి నిజంగా బుద్ధి పుట్టిన నాడు కొడుకు మళ్లీ మాటాడకుండా నోరు మూశాడు. వంటింట్లో పని అతి త్వరగా ముగించుకుని పాపాయీ పాలబుడ్డి తనూ ఆ గుమ్మం ముందు హాజరయ్యేది. డాక్టరు బూట్లచప్పుడు వింటూనే ఆమెగుండె దడదడ కొట్టుకునేది. అతడు యివతలికి వచ్చేదాకా కళ్లన్నీ ఆ గుమ్మంమీద ఉండేవి. ఇవతలికి రాగానే కూడా వచ్చిన కొడుకుమొహం వెయ్యికళ్లతో చూసేది ఏమిటో అర్థంకాక గిలగిల కొట్టుకునేది అయితే ఆ ముసిలిదాని మనోవ్యథని భగవంతుడు ఆట్టే కాలం ఉంచలేదు. చిను చిటుక్కుమనని ఒక కాళరాత్రి సమయాన గౌరి మరి రాని చోటికి నడచిపోయింది!

గౌరి మరణవార్త మొదటిసారి విన్నప్పుడు రుక్మిణమ్మ ప్రతి రక్తబిందువూ చలించిపోయింది. తలదించి పాపాయిని గాని, దించిన తలఎత్తి కొడుకునిగాని ఎలా చూడ్డమో ఆమెకి అర్థం కాలేదు అక్కర్లేదు. ఆమె తల ఎత్తకుండా నేక్షోభించిన హృదయం పిడుగులు రాల్చింది.

అమ్మా! ఇప్పుడు యిల్లంతా నీది! యీ ఇంటికి ఏక చ్ఛత్రాధిపత్యం నీది ఎలు తల్లీ. తనని తీరా ఏలు! ఇక ని ఆజ్ఞకి ఎదురులేదు... మాటకి తిరుగులేదు.కళ్లు చిట్లించడాలూ మూతి విరుపులూ ఇక నీకు అడ్డం తగలవులే... అంతా నాశనమై

పోయిన తరువాత ఈ శ్మశానానికి సర్వాధికారిణివి నీవేలే..."

సర్వస్వం కోల్పోయిన సంక్షోభంలో శేషగిరి తల్లిని అనకూడనిమాట అంటూ లేకుండా దులిపిదుళ్ళగొట్టేశాడు రుక్మిణమ్మ మనసులో ఎన్ని తుఫానులు చెలరేగాయోగాని, వంచిన తల ఎత్తలేదు. కంటచుక్క కార్చలేదు. ... ఉన్నచోటకదలలేదు.

"అమ్మా! నువ్వు కఠినాత్ముురాలవమ్మా! పెళ్లాం పోతే మరొకర్తి వస్తుంది. తల్లి పోతే రాదు కదా! అని నువ్వే అన్నావు. నీ కోడలు ఒకడికి పెళ్లాం. మాట నిజమే... మరొకర్తివి, మరో మందభాగ్యురాల్ని మరుక్షణంలో నా మెడకు కట్టినా కట్టగల సమర్థురాలివి నువ్వు. కాదనను. కాని ఆ మాట అన్నప్పుడు నువ్వు ఒక్కమాట మరచిపోయావు. నీ కోడలు మరొకరికి తల్లి కూడాను... ఆ తల్లి మరి రాదుకదా నువ్వన్నమాటే... నీ ఒళ్లోనే ఉన్నాడు. మనవడు... వాడికి తల్లిని తెచ్చి ఇవ్వగలవా? మాట్లాడవేం అమ్మా? నీ గుండె రాయి అయిపోయిందా అమ్మా?"

"లేదు; మా అమ్మగుండెరాయి అయిపోయింది అనుకుని ఉండను; పాపాయికి కనుక మనసంటూ ఉండిఉంటే. నిజమే, వాడి మాట కూడా కాదనడానికి లేదు. గౌరికి మనస్సు విరిగిపోయినదగ్గర్నుంచి తన గురించే తప్ప మరొకటి ఆలోచించాలన్న జ్ఞానం కూడా కోల్పోయింది. పాపాయికి కాస్త నలతగా ఉంటే చాలు, పంచప్రాణాలూ పోయినట్టు గాబరా పడిపోయేది. వాడు ఏ మంచం కిందైనా పాకి, ఒక నిమిషం కనబడకపోతేచాలు; యిల్లంతా ఓ వందమార్లు వెతికేది వాడు కడుపునిండా పాలు తాగనట్టు ఏ మాత్రం అనుమానం తగిలినా చాలు; ఒక్కముద్ద నోట్లో పెట్టుకోలేకపోయేది. ఎంతసేపూ

పిచ్చి వెధవ, ఏ తలుపుసందున వేలెట్టేస్తాడో అని బెంగ... ఎంతసేపూ కుర్రకుంకకి ఎవరు దిష్టిపెట్టేస్తారో అని బాధ... నిజానికి అమ్మ అన్నీ దగ్గరుండి చెబితేగాని ఈ వెర్రి నాగమ్మలకి ఏం తెలుసుననీ? బోర్లా పడదామని ఎడంచెయ్యి మడచి ముందుకు పడేసుకుని పనసపండులాంటి ఒళ్లు దాని మీద చేరుస్తారు. ఆ చెయ్యి తీసుకోలేరు. క్యారు క్యారుమని ఇల్లెగర గొట్టేస్తారు. అమ్మొచ్చి ఆ చెయ్యి తియ్యాలి... జానెడు దూరంలో ఉన్న 'దొండకాయుని' అందుకోలేక అర్త నాదాలు చేసేస్తాడు. అమ్మొచ్చి అభయ ప్రధానం చెయ్యాలి.

ఆ బుగ్గలే బూరెలు. ఆ పెదిమలే రసగుల్లాలు. ఆ కన్నులే కాజాలు అమ్మ ముద్దెట్టుకోని జాగా అబ్బాయి శరీరంలో లేదు.

'అంత అస్తారు వదంగా లాలించిన, అంత అల్లారు ముద్దుగా పెంచిన నన్ను విడిచి ఎలా వెళ్ల గలిగావుఅమ్మా? అసలు పదిలోజులనుంచీ ఓ. రోజు కోరోజుసీకొక పాపాయి నంటూ నేనున్నాననే ఆలోచనేనీనుంచి దూరమయిందా అమ్మా? అయిదు నిమిషాలు నన్ను వదిలేదానివి కాదు— నేను గట్టిగా ఏడుస్తేకూడా వినిపించుకోనంతగా నీ మనసు అన్యాక్రాంతం అయిందా అమ్మా!

అవును... నాన్నమ్మను అనుకోడం దేనికి? నీ గురించి తప్ప మరొకరి గురించి ఆలోచించలేనంతగా నువ్వు మారి పోయావు, నువ్వూఆడదానవే.నీ స్వార్థమే నిన్ను కాటువేసింది.

పాపాయికి మనసంటూ ఉంటే, తప్పక ఈ మాటలు తల్లినడిగి ఉండును. అవును, ఆడది కఠినాత్మురాలు.'

—( * )—